సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి : ఎమ్మెల్యే



ఉమాగౌరీశంకర్‌కు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక ఇబ్బందులలో ఉన్న పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని షిరిడీసాయినగర్‌కాలనీకి చెందిన ఉమా గౌరీశంకర్ నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల వ ల్ల వైద్యం కోసం ఇటీవల ఎమ్మెల్యేను వారి కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఎమ్మెల్యే వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. వైద్యం కోసం రూ.1.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు కావడంతో గురువారం ఎమ్మెల్యే ఉమాగౌరీశంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌నాయక్, బాధితుడి తల్లి సుగుణ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, కౌన్సిల్ విద్యారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 4వ వార్డు బృందావన్, బ్యాంక్‌కాలనీలో రూ.13లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ జయశ్రీరాజు, స్థానిక కౌన్సిలర్ విద్యావిజయేందర్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జయశ్రీ మాట్లాడుతూ దశలవారీగా అన్నివార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఈ సుమంత్, మోహన్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, సంతోష్‌గౌడ్, స్వామి, పద్మ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓస్‌కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేసిన ఆయన అక్కడ నెలకొన్న అపరిశుభ్రతతో పాటు తరగతి, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిత్యం పాఠశాల ఆవరణతో పాటు మరుగుదొడ్లను శుభ్రం చేసి విద్యార్థులకు రోగా లు దరిచేరకుండా చూడాలన్నారు. త్వరలోనే పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, జీహెచ్‌ఎంసీ ఏఈ రాజ్‌కుమార్, ఎస్ఎస్ అజీముద్దీన్, ఎస్ఎఫ్ఏ మైరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

బైరామల్‌గూడ ఓల్డ్ విలేజీలో కార్పొరేటర్ పర్యటన

చంపాపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ ఓల్డ్ విలేజీలో గురువారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పర్యటించారు. బస్తీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ చంపాపేట డివిజన్‌లోని ఆయా కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు శరవేగంతో జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు సహకరించి ఇళ్ల ముందున్న ర్యాంపులు, మెట్లు, మొక్కల కోసం నిర్మించుకున్న గోడలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, స్థానికులు మనెమ్మ, యాదమ్మ, ఐలమ్మ, దశరథ, వెంకటేష్, మురళీధర్‌రెడ్డి, గోపీ, సతీష్, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏసీపీ వెంకన్ననాయక్

సైదాబాద్ పీఎస్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

సైదాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ వెంకన్ననాయక్ సందర్శించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను సిబ్బంది పనితీరును పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీఎస్ ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదు, కేసుల దర్యాప్తు నిష్పక్షపాతంగా ఉండాలని, పీఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ఉండాలని అన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి సాక్షులను కోర్టు ముందు నిర్ణీత సమయాలలో ప్రవేశపెట్టాలని తెలిపారు. సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేందర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఎస్ఐలు సాయికృష్ణ, శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



అఖిలపక్ష నేతల సమావేశంలో ఎంపీడీవో శ్రీవాణి తదితరులు

పోలింగ్ కేంద్రాలపై అఖిలపక్ష సమావేశం

- నేతల నుంచి అభ్యంతరాల స్వీకరణ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గురువారం హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీవాణి అధ్యక్షతన అఖిలపక్ష పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, కాం గ్రెస్, బీఎస్పీ నేతలు పాల్గొన్నారు. పోలింగ్ స్టేషన్లపై ఆయా పార్టీల నేతల నుంచి అభిప్రాయాలతో పాటు అభ్యంతరాలను స్వీకరించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండల పరిధిలో మొత్తం 148 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 17న ఫైనల్ పబ్లికేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రాసేనారెడ్డి, ఎంపీవో మధుసూదనాచారితో పాటు ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు.

అధ్వానపు డ్రైనేజీతో అవస్థలు

దుర్గంధంగా మన్సూరాబాద్‌లోని వివేకానందనగర్‌కాలనీ

- మురుగు పరుగులతో తాగునీరు కలుషితం
- రోగాల బారినపడుతున్న జనం



ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీరోడ్డులో నిలిచిన డ్రైనేజీ, వరద నీరు(ఫైల్)



పొంగిపొర్లుతున్న డ్రైనేజీని చూపుతున్న వివేకానంద నగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ వివేకానందనగర్‌కాలనీలో డ్రైనేజీ అధ్వానంగా తయారైంది. దీంతో కాలనీ రోడ్లతో పాటు ప్రధానరోడ్డుపైకి సైతం మురుగునీరు వచ్చి చేరడంతో నివాసితులతో పాటు వాహనదారులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా డ్రైనేజీ సరిగా లేకపోవడంతో తాగునీటి పైప్‌లైన్లతో పాటు భూగర్భ జలాలు సైతం కలుషితమై తాగేందుకే కాదు.. వాడుకునేందుకు కూడా పనికిరాకుండా పోతున్నాయి. దీంతో కాలనీవాసులు ప్రతినెల డబ్బులు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుని వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు డ్రైనేజీ మురుగు పారుదలతో పాటు దాని నుంచి వచ్చే దుర్గంధంతో ఇప్పటికే పలువురు రోగాల బారినపడినట్లు తెలుస్తోంది.

జలమండలి, జీహెచ్‌ఎంసీ సమన్వయ లోపంతోనే..

జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల్లో సమన్వయ లోపం కాణంగానే ఐదేళ్లుగా నెలకొన్న డ్రైనేజీ మురుగు సమస్య తీరడంలేదని తెలుస్తోంది. జలమండలి అధికారులకు వెళ్లి సమస్యను వివరిస్తే తమకు సంబంధం లేదు జీహెచ్‌ఎంసీ వారి దగ్గరికి వెళ్లాలని చెప్పడం, జీహెచ్‌ఎంసీ అధికారులకు చెబితే జలమండలి వారి వద్దకు వెళ్లాలంటూ కాలం వెళ్లదీస్తున్నారంటూ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు అధికారులు మొక్కుబడిగా వచ్చి చూడడమే తప్పా చర్యలు తీసుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు.

దుర్గంధం భరించలేక ఇళ్లు ఖాళీ..

డ్రైనేజీ నుంచి రోడ్డు పైకి వచ్చి చేరే మురుగునీటితో పాటు దాని నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేక ఇప్పటికే కొందరు నివాసితులు ఇళ్లను ఖాళీ చేశారని, అయినా అధికారుల్లో చలనం లేదంటూ కాలనీవాసులు పేర్కొంటున్నారు. సమన్వయంతో సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు తమ పరిధి కాదంటే.. కాదంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

బాలికల గురుకుల పాఠశాల ఉన్నా.. పట్టింపు కరువు

మన్సూరాబాద్‌లోని వివేకానందనగర్‌కాలనీ రోడ్డు నంబర్.6లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా నెలకొంది. అదే ప్రాంతంలో ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ఉంది. అందులో సుమారు 2వేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. డ్రైనేజీ మురుగు పొంగిపొర్లుతుండడంతో గురుకుల పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందితో రావాల్సి వస్తోంది. దీనికి తోడు ముక్కుపుటాలదిరేలా దుర్గంధం వస్తుండడంతో గురువులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎలా చెబితే అధికారులకు అర్థమవుతుంది

ఐదేళ్లుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంటోందని అటు జలమండలి, ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులకు సమస్యను వివరిస్తూ వస్తున్నా పట్టించుకోవడం లేదు. సమస్యను వివరించినప్పుడల్లా మొక్కుబడిగా ఇరుశాఖల అధికారులు వేర్వేరుగా వచ్చి చూస్తున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదు. అక్కడ 2వేల మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నామని చూపినా, రోడ్లపైకి మురుగు చేరడంతోపాటు తాగునీరు కలుషితమై తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కళ్లకు కట్టినట్టు చూపినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. అధికారులు ఇదే వైఖరి ప్రదర్శిస్తే రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.



- ఎంపీ శ్రీరామ్‌రెడ్డి, అధ్యక్షుడు, వివేకానందనగర్‌కాలనీ

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

వివేకానందనగర్‌కాలనీలో డ్రైనేజీ అధ్వానంగా తయారైంది. సమస్యను కాలనీవాసులతో కలిసి పలు మార్లు అధికారులకు వివరించాం. వారు వచ్చి సమస్య చూసి వెళ్తున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారుల్లో సమన్వయ లోపం కారణంగానే సమస్య తీరడం లేదు. ఇరుశాఖల అధికారులు సమన్వయంగా ఉండి నెలకొన్న సమస్యకు వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలి.



- కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్, మన్సూరాబాద్

రేపు జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్

- రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి



జడ్జి శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 14న రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు కానీ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను కానీ రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే వేదిక ఈ లోక్‌అదాలత్ అని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న సివిల్‌కేసు లోక్ అదాలత్‌కు పంపబడి, ఆతర్వాత పరిష్కరించబడినట్లయితే వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా కక్షిదారులకు తిరిగి చెల్లించబడుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇరు పక్షాలు గెలిచినట్లేనన్నారు. ఈ లోక్‌అదాలత్‌ల ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని చెప్పారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటి కేసులు, చెక్కు బౌన్స్ కేసులు ఇతర రాజీకి వీలున్న కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాజీమార్గమే రాజమార్గమని ఆమె అన్నారు.

సురక్షిత ప్రయాణం కోసమే ట్రాఫిక్ నిబంధనలు

- టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్



బైకు రైడింగ్ నిబంధనల ప్రాధాన్యతపై యానిమేషన్ చిత్రం చూస్తున్న విద్యార్థులు

కొత్తపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సురక్షిత వాహన ప్రయాణం కోసమే ట్రాఫిక్ నిబంధనలు రూపొందించారని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. గురువారం జిల్లెలగూడలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదివే 41 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కులో సందడి చేశారు. టీటీఐ సిబ్బంది వారికి సైనేజీ బోర్డు చూపుతూ బైకు నడిపే వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. లెక్చర్ హాల్‌లో సిమ్యులేటర్‌పై వాహనాలను నడిపే తీరును, యానిమేషన్ చిత్రాల ద్వారా బైకు నడపడంలో జాగ్రత్తలనూ చూపించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అర్జున్ మాట్లాడుతూ బడంగ్‌పేట, జడ్‌పీహెచ్ఎస్ బైరామల్‌గూడ, కొత్తపేట, ఎల్బీనగర్, రాక్‌టౌన్‌కాలనీ, టెలిఫోన్‌కాలనీల్లోని ప్రైవేటు పాఠశాలలు, బడంగ్‌పేటలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు టీటీఐ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

15 కార్యక్రమాల్లో 664మంది విద్యార్థులకు అవగాహన

వివిధ విద్యాసంస్థలలో 15 కార్యక్రమాల్లో 664 మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను పరిచయం చేశారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని కోరారు. టీటీఐ లెక్చర్ హాల్‌లో 5 డీడీ కౌన్సెలింగ్ సెషన్స్‌లో 144 మంది పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీటీఐ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేష్‌కుమార్



ధర్నా చేస్తున్న మహేష్‌కుమార్ తదితరులు

చాదర్‌ఘాట్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైనా ఇంతవరకు విద్యా, దళిత సంక్షేమ శాఖలకు మంత్రులను ఎందుకు నియమించలేదని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేష్‌కుమార్ ప్రశ్నించారు. గురువారం తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాది పాలనపై విజయోత్సవాలు జరుపుకునేంత సంక్షేమం ఎం చేశారో ఒక్కసారి విద్యార్థులకు, నిరుద్యోగులకు వివరించాలన్నారు. విద్యాశాఖకు మంత్రి పదవిని మరొకరికి కేటాయించకుండా సీఎం తన వద్దే పెట్టుకుని విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల పట్ల వ్యవహరిస్తున్న తీరును ఉన్నతస్థాయి సమీక్ష జరిపి విద్యార్థి సంఘాలతో చర్చిస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఈర్ల ప్రసాద్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్, గ్రేటర్ అధ్యక్షుడు మేడి రాజు, ప్రధాన కార్యదర్శి నిమ్మల సతీష్, కార్యదర్శులు ఉదయ్, యోగి, శివ, భాను, తరుణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జనవరి 27న లక్ష డప్పులు..

వెయ్యి గొంతులతో దండోరా ప్రదర్శన

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ సాధించే దిశగా తుది ఘట్టంగా జనవరి 27న హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వెయ్యి మంది కళాకారుల గొంతులతో దండోరా ప్రదర్శన, సభ ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. గురువారం సోమాజిగుడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ కళాకారులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 9 మంది కళాకారులను గుర్తించి వారికి కోటి రూపాయల నగదు, తామ్ర పత్రం, 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు ప్రకటించడం సంతోషకరమే అయినా .. వారిలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు లేకపోవడం తమను వివక్షకు గురిచేయడమేనని అన్నారు. అందెశ్రీని కొందరు మాదిగ అని ప్రచారం చేస్తున్నారని, అయితే, తాను విశ్వనరుడనని ఆయన పేర్కొన్నారని, మాదిగనని ఎప్పుడు చెప్పలేదని అన్నారు. కళాకారుల ఎంపిక విషయంపై ప్రభుత్వం పునఃపరిశీలించి మాదిగ కళాకారులను గుర్తించాలని కోరారు. తెలంగాణ ప్రముఖుల్లో తెలంగాణ కోసం త్యాగం చేసిన వారిని విస్మరించారని, శిల్పి యాదగిరిరావును శాసనమండలికి పంపాలని డిమాండ్ చేశారు. కళాకారులు, ప్రముఖుల్లో మహిళలకు తగు ప్రాధాన్యమివ్వాలని, తెలంగాణ ఉద్యమాన్ని చెన్నారెడ్డి అనంతరం నడిపించిన టీఎన్ సదాలక్ష్మితో పాటు చాకలి ఐలమ్మ, కేశవరావు జాదవ్, విమలక్కలను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. ఎస్సీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న మాల కులస్థులు సమాజంలో ఒంటరయ్యారన్నారు. డిసెంబరు 27 నుంచి అన్ని జిల్లాల్లో రథయాత్రలు నిర్వహించి దండోరా సభకు లక్ష డప్పులతో మాదిగలు వచ్చేలా చేస్తామన్నారు. ఈ ప్రదర్శన, సభకు మాదిగ కళాకారులు ప్రజా యుద్ధనౌక ఏపూరి సోమన్న అధ్యక్షత వహిస్తారన్నారు.

బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠిస్తాం..

తెలంగాణ తల్లులుగా కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు పెట్టిన విగ్రహాలను తాము అంగీకరించబోమని, తాము అధికారంలోకి వస్తే చాకలి ఐలమ్మ రూపంలో ఉండే బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకుంటామని మందకృష్ణ మాదిగ అన్నారు. సమావేశంలో మాదిగ కళాకారులు ఏపూరి సోమన్న, ఎస్ఐ అశోక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, కళాకారులు గిద్దె రాంనర్సయ్య, భరత్, మల్లెపాక అనిల్, గజ్జల అశోక్, డప్పు రమేష్ పాల్గొన్నారు.



సీఎం కప్ అందజేస్తున్న తహసీల్దార్ జయశ్రీ, డిప్యూటీ డీఈవో రాధాకృష్ణ

సీఎం కప్ విజేతలకు బహుమతుల ప్రదానం

చాదర్‌ఘాట్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్ ఆవరణలో మూడు రోజుల పాటు జరిగిన సైదాబాద్ మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఖోఖో పోటీల్లో సైదాబాద్‌లోని టీజీఎంఆర్ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కబడ్డీ పోటీల్లో మలక్‌పేట జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలవగా మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. వాలీబాల్ పోటీల్లో మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా దిల్‌సుఖ్‌నగర్‌లోని నవ్య జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకున్నారు. విజేతలకు సీఎం కప్‌ను తహసీల్దార్ జయశ్రీ, డిప్యూటీ డీఈవో రాధాకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హరికృష్ణ, స్కేటింగ్ కోచ్ నిర్మల్‌సింగ్‌లు ప్రదానం చేశారు. విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించేందుకు ప్రాక్టీసు చేయాలని తహసీల్దార్, డిప్యూటీ డీఈవో సూచించారు.



యాంటీ ర్యాగింగ్ సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : ఇన్‌స్పెక్టర్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): సీనియర్లు జూనియర్ విద్యార్థుల పట్ల సోదరభావంతో మెలగాలని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్‌పై సదస్సు నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ఎస్ఐలు కరుణాకర్‌రెడ్డి, బద్యానాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఫ్రెండ్లీగా ఉండాలే తప్ప ర్యాగింగ్ వరకు వెళ్లకూడదన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలను దరిచేరనివ్వద్దని సూచించారు. మంచిగా చదువుకుని తల్లిదండ్రులు, కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ రాంచంద్రా రెడ్డి, ఉమామహేశ్వరరావు, అజ్మల్ హుస్సేన్, బాలాజీ, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

బీసీలకు 8 మంత్రి పదవులు కేటాయించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

బర్కత్‌పుర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని, బీసీలకు 8 మంత్రి పదవులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కేవలం ఇద్దరు బీసీలు మంత్రులుగా కొనసాగుతున్నారని, 55 శాతం జనాభా ఉన్న బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రివర్గంలో రెడ్లకు, వెలమలకు మాత్రమే న్యాయం జరిగిందన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అగ్రవర్ణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు తిరుగుబాటు చేసి గుణపాఠం చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అదే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. గౌడ కులస్థులకు చెందాల్సిన ఎక్సైజ్ శాఖను వెలమ కులానికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈవిషయంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత రాహుల్‌గాంధీకి లేఖ రాస్తామన్నారు. బీసీల మంచితనాన్ని బలహీనంగా భావిస్తే రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అన్యాయం జరిగితే సహించబోమని, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు కుందారం గణేశ్‌చారి, బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.